

1నుంచి గృహజ్యోతి పథకం అమలు

● విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28: నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో 8జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు మార్చి1నుంచి గృహజ్యోతి పథకం అమలు చేస్తామని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి అర్హులైన వారికి మార్చి నుంచి గృహజ్యోతి పథకం కింద 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందజేస్తామని తెలిపారు.

జిల్లా కలెక్టర్‌గా స్నేహ శబరీష్


స్నేహ శబరీస్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28: జిల్లా కలెక్టర్‌గా 2017ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన స్నేహ శబరీష్‌ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు. స్నేహశబరీష్ జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా కొనసాగుతుండగా ఆసిఫాబాద్‌జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం కలెక్టర్‌లను బదిలీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న హేమంత్ బోర్కడేను జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా బదిలీచేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. జిల్లాగా ఏర్పడిన తరువాత ఆసిఫాబాద్‌కు మొట్ట మొదటిసారిగా మహిళా కలెక్టర్‌ను ప్రభుత్వం నియమించింది.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

● డీఎంహెచ్‌వో తుకారాం భట్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28: ఏప్రిల్ 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి తుకారాంభట్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా సంక్షేమశాఖ, జిల్లా గిరిజన అభివృద్ధిశాఖ, జిల్లా విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాతూ ఏప్రిల్ 3న జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని, జిల్లాను పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దానలి కోరారు .జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలు 57,362 మంది ఉన్నారని, వీరందరికి వాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వ్యాక్సినేషన్ కొరకు 672కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 78మంది సూపర్‌వైజర్లను నియమించడంతోపాటు 22మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని బస్టాండు, రైల్వేస్టేషన్లలో వ్యాక్సినేషన్‌కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. 3న వ్యాక్సినేషన్ కానీ పిల్లల కోసం 4,5 తేదీల్లో ప్రతిఇంటిని సందర్శించి పిల్లలకు వ్యాక్సినేషన్ అందించడం ద్వారావందశాతం కార్యక్రమాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు, ఐసీడీఎస్, ఐకేపీ, మెప్మా, సహాయసిబ్బంది సమన్వయంతో విజయవంతంచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, గిరిజనాభివృద్ధి అధికారిణి రమాదేవి, సంక్షేమ శాఖాధికారి భాస్కర్, విద్యాశాఖపరీక్షల కమీషనర్ ఉదయ్‌బాబు, డిస్ట్రిక్ ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 28: కాగజ్‌నగర్ పట్టణంలో బుధవారం పీఆర్టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను ప్రముఖ వైద్యుడు డాక్టర్ నాచగిరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాసైన్స్ అధికారి మధుకర్, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు తౌటం శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

విరిసిన మోదుగపూలు



దారికిరువైపులా ఆకట్టుకుంటున్న మోదుగ పూలచెట్లు

వాంకిడి, ఫిబ్రవరి 28: అగ్నిజ్వాలలు నవ్వినట్టుగా ఉండే ఎర్రెర్రని మొదుగ పూలు సూర్యకాంతికి ధగధగ మెరిసిపోతూ ఆకర్శిస్తున్నాయి. వాంకిడి నుంచి కనర్‌గాం, రోహినిగుడ గ్రామాలకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఎర్రనిపూలతో ఉన్న చెట్లు వాహనదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ పూలను సేకరించి ఎండబెట్టి పొడిగా తయారు చేసి చాలామంది టీపొడిగా వాడతారు. కొందరు హోళిరోజున రంగులు వేయడానికి ఉపయోగిస్తుంటారు. గ్రామాల్లో సహజంగా కనిపించే మోదుగ చెట్లు ఎండాకాలం సమీపించే సమయంలో ఆరెంజ్ రంగుపూలతో కనుల విందు చేస్తూ ఆకట్టుకుంటాయి.

కౌలు రైతుల ఎదురుచూపులు

● సహాయం అందిస్తామని ప్రకటించిన సర్కారు
● ఖరారు కాని రైతు భరోసా విధివిధానాలు
● జిల్లాలో సుమారు 20వేలకు పైగా కౌలు రైతులు
● ఆరుగ్యారంటీల్లో నాలుగింటి అమలు





ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28: ప్రభుత్వం ప్రకటనతో కౌలు రైతుల్లో సంతోషం నెలకొంది. ఉపాధి మార్గం లేక సొంత భూములు లేక భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయాన్నే నమ్ముకొని జీవిస్తున్నారు కౌలు రైతులు. ఏడాదంత కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాలు ధర లేకపోయిన ప్రతి కూల వాతవరణంలో గిట్టుబాటు తగ్గి అప్పుల్లో కూరుకు పోతున్నా ఏ ప్రభుత్వం కనికరం చూప లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాలనలో కౌలురైతులకు మొండిచేయి చూపింది. రాష్ట్రంలో నూతనంగా ఆధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కౌలురైతులను అదుకుంటామని రైతు భరోసా పథకం ద్వారా రైతులతో పాటు కౌలురైతులకు సైతం ఏడాదికి రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టగా రైతు భరోసా కూడా అమలవుతుందన్న సంతోషంలో రైతులు ఉన్నారు. కానీ విధివిధానా లను మాత్రం ఇప్పటికి ప్రకటించలేదు.

ఖరారు కాని విధివిధానాలు :-

కౌలు రైతులకు ఆర్థిక సహాయం అందించే రైతు భరోస పథకంపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి విధివిధానాలను ప్రకటించలేదు. ఈ పథకం అర్హుల గుర్తింపునకు ప్రభుత్వం ఎలాంటి చర్యలను తీసుకుంటుందోనని కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. వచ్చే వానాకాలం సీజన్‌కోసం గ్రామాల్లో భూములను కౌలుకు తీసుకునే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతు న్నది. ప్రభుత్వం కౌలు రైతులకు సైతం ఆర్థిక భరోస కల్పిస్తామని ప్రకటించడంతో భూయాజమానులు కౌలు పత్రాలు రాసి ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. కౌలు పత్రాలు రాసి ఇస్తే రైతు భరోస పథకానికి ఎక్కడ దూరమవుతామోనని భూ యాజమానులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం కౌలురైతులను పూర్తిగా విస్మరించింది. భూ యాజమానులకు పంట పెట్టుబడి సహాయం అందించగా కౌలు రైతులకు ఎలాంటి సహాయం అందించలేదు.

జిల్లాలో 20వేల కౌలు రైతులు..

జిల్లాలో అనధికారిక లెక్కల ప్రకారం సుమారు 20వేలకు పైగా కౌలు రైతులు ఉంటారు. వీరిలో అధికశాతం మంది పత్తిపంటను సాగు చేస్తు న్నారు. వర్షధార పంటలు ఇతర పంటలతో పోలిస్తే ఎక్కువ లాభాలు వచ్చే ఆవకాశాలు ఉండటంతో కౌలు రైతులు పత్తి సాగుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో కౌలు భూముల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భూముల స్వభావాన్ని బట్టి ఎకరానికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు కౌలు చెల్లించాల్సి వస్తుంది. ఇకగ్రామాలకు ఆనుకొని ఉన్న భూములు సారవంతమైన నల్లరేగడి, ఎర్రరేగడి భూములకు ఎకరానికి రూ.20వేల వరకు డిమాండ్ ఉంది. మూడేళ్ల క్రితం పత్తి క్వింటాకుకు రూ.11 వేల వరకు ధర పలుకగా భూ యాజమా నులు కౌలు ధరలు భారీగా పెంచారు. ఇది ఏటేటా పెరుగుతూనే వస్తోంది.

ప్రభుత్వం ఆదుకోవాలి..:లట్కారీ శంకర్, కౌలురైతు, చింతలమానేపల్లి



ప్రభుత్వం కౌలు రైతులను ఆదుకోవాలి. గతంతో పోలిస్తే ఈసారి భూముల కౌలు ధరలు బాగా పెరిగాయి. ఐదేకరాల భూమిని ఎకరానికి రూ. 15వేల చొప్పున కౌలుకు తీసుకున్నాను. ఇప్పటివరకు ఎలాంటి లాభం రాలేదు. సొంత భూమి లేకపోవడం మరో ఉపాధి మార్గం లేక తప్పని పరిస్థితిలో వ్యవసాయం చేయాల్సి వస్తోంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకొని ఇచ్చిన హామీని నెరవేర్చాలి.

ఏటేటా కౌలు ధరలు పెరుగుతున్నాయి..

గుండా సంతోష్, కౌలురైతు, ఆసిఫాబాద్



ప్రతిఏటా కౌలు ధరలు ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఎకరానికి రూ. 10 నుంచి రూ. 15వేల వరకు ధర పలుకుతున్నది. గ్రామాలకు ఆనుకొని ఉన్న భూ ములకు డిమాండ్ చాలా ఉంది. అధిక ధరలకు కౌలు తీసుకొని సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి రాక నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి పెట్టుబడి సహాయం అందించాలి.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


ఆసిఫాబాద్ పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు


ఆసిఫాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షాకేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమసంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. మొదటిరోజు తెలుగుపరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలోని పలు పరీక్షకేంద్రాలను అధికారులు సందర్శించి పరీక్ష నిర్వహణపై సూచనలు,సలహాలు చేశారు. కలెక్టర్ హేమంత్ బొర్కడే జిల్లా కేంద్రంలోని పీజీటీ పాఠశాల, కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వజూనియర్ కళాశాలను, రెబ్బెన జూనియర్ కళాశాలను డీఐఈవో నైతం శంకర్, డెక్ సభ్యుడు రాజయ్య, స్థానికఎస్సై చంద్రశేఖర్ తనిఖీచేశారు. జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఎస్పీ సురేష్‌కుమార్ తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కాగా జిల్లా వ్యాప్తంగా జనరల్ 4745, వొకేషనల్ 880 మంది మొత్తం 5625కి గాను జనరల్ 4521, వొకేషనల్ 798మంది హాజరయ్యారు. 306 మంది గైర్హాజరు అయినట్లు డీఐఈవో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9కేంద్రాలలో పకడ్బందీగా పరీక్షలునిర్వహించినట్లు పేర్కొన్నారు.

అనుమతి నిరాకరణ..

ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధన వర్తిస్తున్న నేపథ్యంలో మొదటి రోజు జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ముగ్గురు విద్యార్థులు పది నిమిషాలు ఆలస్యం రావడంతో వారిని అధికారులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు.

కాగజ్‌నగర్/బెజ్జూరు/ దహెగాం /కౌటాల/ కెరమెరి/తిర్యాణి: కాగజ్‌నగర్‌లో బుధవారం ఇంటర్‌పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో మూడుకేంద్రాల్లో పరీక్షకేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షరాసే విద్యార్థులను ఉదయం 8.30గంటలకే పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. బెజ్జూరులో మొత్తం 203మందికి గాను 14మంది గైర్హాజరయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ జ్ఞానేశ్వర్, డీవో గణపతి, దహెగాంలో 8మంది గైర్హాజరైనట్లు సీఎస్ అమరేందర్, డీవో అశోక్, కౌటాలలో జనరల్‌లో 238మందికి గాను 227మంది, వొకేషనల్‌లో 137 మందికి గాను 124 మంది హాజరయ్యారు. కెరమెరిలో145 మందికి గాను 141మంది హాజరైనట్లు సీఎస్ పరుషరాములు తెలిపారు. తిర్యాణిలో 247మందికి గాను 223 హాజరు కాగా 24 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు తెలిపారు.

జిల్లాస్థాయి ఖేలో ఇండియా సెంటర్ ప్రారంభం


సెంటర్ ప్రారంభిస్తున్న సంక్షేమాధికారిణి రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ అనుమతితో జిల్లాకేంద్రంలో నూతనంగా షూటింగ్ బాల్‌క్రీడను, జిల్లాస్థాయి ఖేలో ఇండియా సెంటర్‌ను ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా క్రీడల శాఖాధికారిణి రమాదేవి ప్రారంభించారు. కార్యక్రమంలో నేషనల్ షూటింగ్ బాల్ ప్లేయిర్, కోచ్‌రాకేష్, ఏసీఎంవోఉద్దవ్, హెచ్ఎం కృష్ణారావు, క్రీడల అధికారి మీనారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నిధులు

● ఎంపీ సోయం బాపూరావ్

జైనూర్, ఫిబ్రవరి 28: గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎంపీల్యాడ్ కింద నిధుల మంజూరు చేసిందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని కాలేజీగూడలో బుధవారం ఆయన రూ.5 లక్షలతో నిర్మించనున్న రెండుసిమెంట్ రోడ్లకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలపార్టీ అధ్యక్షుడు కోట్నాక దౌలత్‌రావ్, ఆత్రం భీంరావ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

జైనూరులో కాంగ్రెస్ సంబరాలు

జైనూర్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం రెండు వందల యూనిట్లు ఉచిత విద్యుత్, రూ.500లకు గ్యాస్ పథకం అమలు చేయడంతో జైనూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్ మాట్లాడుతూ మిగిలిన గ్యారెంటీలకు త్వరలో మోక్షం లభిస్తుందన్నారు.

5న క్రీడా పాఠశాలలో ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 28: గిరిజన సంక్షేమశాఖ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మూడు క్రీడాపాఠశాలలు, హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలోగల వాటర్‌స్పోర్ట్స్ అకాడమీ క్రీడా పాఠశాలలో నైపుణ్యంగల గిరిజన విద్యార్థులకోసం ఆసిఫాబాద్ ఆదర్శ గిరిజన బాలికల క్రీడాపాఠశాలలో మార్చి5న జిల్లాస్థాయి ఎంపికపోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏపీవో ఖుష్బూగుప్తా, గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాకురాలు ఆర్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని రుద్రాపూర్, కోర్సిని గామాల్లో సీసీరోడ్ల పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకయ్య, శంకర్, శ్రీనివాస్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగుల చేయూత

కౌటాల, ఫిబ్రవరి 28: మండలంలోని మొగడ్దగడ్ గ్రామానికి చెందిన ఎల్ములె తిరుపతి ఈ నెల 9న ఇంటికి వెళ్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో చికిత్సపొంది స్వగ్రామానికి రాగా తోటిఉద్యోగులు రూ.1,00,504 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో అశోక్

తిర్యాణి, ఫిబ్రవరి 28: విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచాలని డీఈవో అశోక్ అన్నారు. బుధవారం మండలంలోని గుడిపేట మండల పరిషత్ ప్రాథమికపాఠశాల, గంభీరావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా రూంటురీడ్ వారు అందించిన పుస్తకాలను, వర్క్‌బుక్‌ను వినియోగించుకుంటున్న విధానాన్ని, రీడింగ్‌కార్నర్స్‌ను ఆయన పరిశీలించారు. జడ్పీపాఠశాలలో నిర్వహించిన సైన్స్ ప్రదర్శణలను పరిశీలించి అభినందించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు అంజయ్య, రూం టూ రీడ్ జిల్లా ప్రతినిధి జెన్నిఫర్, మండల ప్రతినిధి శ్రీనివాసచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతరకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు

● మందమర్రి జీఎం మనోహర్

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 28: ఈనెల 21నుంచి 24వరకు జరిగిన సమ్మక్క సారలమ్మ జాతరకు సహకరించిన ప్రతిఒక్కరికి ఏరియా జీఎం మనోహర్ ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. అందులోభాగంగా ఆర్కే1ఏ గని సమీపాన కొలువుదీరిన సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద తిరుగువారం నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్‌మేనేజర్ మనోహర్, ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ గోవిందరావు పాల్గొన్నారు.

జీవో ప్రకారం వేతనాలు ఇవ్వండి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28: నస్పూర్ మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు బుధవారం నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణుకు వినతిపత్రం అందించారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. కొత్త కార్మికులకు 8 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మున్సిపల్ సంఘం అధ్యక్షుడు కొయ్యల వెంకటి, గౌరవాధ్యక్షుడు రామగిరి బానేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ ఏజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28: ఏజీఎం(ఎడ్యుకేషన్) నికోలస్ శ్రీరాంపూర్‌కువచ్చిన సందర్భంగా ఆమెను డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు ఆధ్వర్యంలో బుధవారం అధికారులు సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీరాంపూర్ ఏరియాలో డీజీఎం(పర్సనల్)గా పనిచేసి పదోన్నతిపై కార్పొరేట్ కార్యాలయానికివెళ్లిన నికోలస్ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్ ఎస్ రాజజేశ్వర్, డిప్యూటీపర్సనల్ మేనేజర్లు ఎస్ రాజశ్వర్‌రావు, ఎం రాజేశ్, దేవేందర్‌రెడ్డి, కార్పొరేట్ డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ కాంతారావు, సీనియర్ పీవో కాంతారావు పాల్గొన్నారు.

ఏరియా ఆడిట్ కమిటీ సమావేశం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28 : శ్రీరాంపూర్ ఏరియా ఆడిట్‌కమిటీ సమావేశం బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఫైనాన్స్‌డిపార్ట్‌మెంట్, పర్సనల్ డిపార్ట్‌మెంట్, స్టోర్స్, గనులలోజరిగే ఆర్థిక కార్యకలాపాలపై ఇంటర్నల్‌ఆడిట్‌డిపార్ట్‌మెంట్ పరిశీలనపై సమీక్షించారు. సమావేశానికి ఇన్‌చార్జి ఎస్‌వోటుజీఎం గోపాల్‌సింగ్ అధ్యక్షత వహించగా, ఏజీఎం (ఫైనాన్స్‌అండ్‌అడిట్) మురళీధర్, ఫైనాన్స్ మేనేజర్ (ఐఏ) జినాగలక్ష్మీ, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ జినగేష్, పర్సనల్ మేనేజర్ ఎ రాజేశ్వర్, డీజీఎం(ఈఅండ్ఎం) కె యాదయ్య పాల్గొన్నారు.

పైరవీలకు తావు లేకుండా క్వార్టర్ల కేటాయింపు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 28: మందమర్రి ఏరియాలో ఉద్యోగులకు ఎలాంటి పైరవీలు లేకుండా క్వార్టర్లను కేటాయిస్తున్నామని కేకే1 గ్రూపు ఏజెంటు రాందాస్ పేర్కొన్నారు. బుధవారం జీఎం కాన్ఫరెన్స్‌హాలులో సూపర్‌వైజర్ల క్వార్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. 26క్వార్టర్లుఖాళీగా ఉన్నాయని నోటిఫికేషన్ విడుదలచేయడంతో దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇందులో 8 క్వార్టర్లను సీనియారిటీ ప్రతిపాదికన కేటాయించామన్నారు. క్వార్టర్ల కోసం ఎవరిని ఆశ్రయించవద్దని, దరఖాస్తు చేసుకోని కౌన్సిలింగ్‌కు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్‌మేనేజర్ శ్యాంసుందర్, డీవైపీఎం మైత్రేయబంధు, ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి మృతికి సంతాపం

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28 : శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ3 గనిలో పనిచేస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన అహ్మద్‌పాషకు బుధవారం గనిపై సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు శంకర్ రావు, గరిగెస్వామి, గోపాల్ రెడ్డి, కుమార్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల

సమన్వయంతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నానయ్య

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 28: అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే మండలాభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ నానయ్య అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నానయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డబ్బా- ధరంపల్లి పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుందని సూచించారు. రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించాలని నిర్మాణపనులు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పనులు గ్రామాల్లో ఇప్పటికీ మొదలు పెట్టకుండా ఏం చేస్తున్నారని అన్నారు. రైతుల పొలాల్లోకి వెళ్లేందుకు మట్టి రోడ్లు వేయాలన్నారు. ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల డబ్బులు రావడం లేదని అన్నారు. రుద్రాపూర్, గంగాపూర్, చింతలమానేపల్లి, కర్జెల్లి, లంబాడీహెట్టి గ్రామాల్లో అసలు పైపులైన్ వేయలేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజుగౌడ్, ఎంపీడీవో ప్రసాద్, జడ్పీటీసీ శ్రీదేవి, కోఆప్షన్ నాజీం హుస్సేన్, ఎంఈవో సోమయ్య, ఏవో రామకృష్ణ, ఏఈ రవీందర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలి

లింగాపూర్, ఫిబ్రవరి 28: సేవాలాల్ మహారాజ్ చుపిన మార్గంలో నడవాలని బంజార గురువు బాబుసింగ్ మహారాజ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జగదంబాదేవి ఆలయాన్ని సందర్శించి భక్తులను ఉద్యేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవాటు చేసుకుంటే మనిషిజీవితంలో బాగుపడుతాడ న్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

లింగాపూర్, ఫిబ్రవరి 28: పల్స్‌పోలియోన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని లింగాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ అజిమ్ అన్నారు. మండలంలో వచ్చేనెల 3నుంచి 5వరకు నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంలో మండలంలోని 0నుంచి 5సంవత్సరాలాలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండలంలో మొత్తం నాలుగు సబ్ సెంటర్‌లను ఏర్పాటుచేస్తున్నామని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మిషన్‌భగరథ పైప్‌లైన్ మరమతులు పూర్తి

వాంకిడి, ఫిబ్రవరి 28: మండలకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మిషన్‌భగీరథ పైప్‌లైన్ మరమతు పనులు పూర్తి చేసినట్లు మిషన్‌భగరథ డీఈ ఇర్ఫాన్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం జాతీయ రహదారి పక్కన పైప్‌లైన్ లీక్ అయి నీరు వృథాగా పోతున్న విషయం తనదృష్టికి రావడంతో మరమతు పనులను చేపట్టి నీటిసరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

'సింగరేణిలో అవినీతి తగ్గ లేదు'

గోదావరిఖని, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సింగరేణిలో అవినీతి తగ్గలేదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఉన్న అవినీతినే పెంచి పోషించుకుంటూ వస్తున్నారు తప్ప అవినీతి మాత్రం తగ్గడం లేదని, గ్రూపు రాజకీయాలు మొదలు పెట్టి దోచుకోవడమే జరుగుతుందన్నారు. ఇప్పటికీ మెడికల్ బోర్డులో జరిగే అవినీతి అందరికి తెలుసునని, అయినా చర్యలు తీసుకోవడంలో విజిలెన్స్ అధికారులు వెనుకడుగు వేయడానికి కారణం ఏమిటో తెలియడం లేదన్నారు. అమాయకులపైన చర్యలు తీసుకోవడానికి ఉత్సాహం చుపుతూ అవినీతికి పాల్పడుతూ కార్మికుల రక్తాన్ని పీల్చుకుంటున్న జలగలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. గెలిచిన సంఘాల నాయకులు పని చేస్తూ ఆదర్శంగా ఉండాలే తప్ప యాజ మాన్యానికి తొత్తుగా మారవద్దని, సంస్థ అభివృద్ధికి తోడ్పడుతూ కార్మికుల సమస్యలపై యాజమాన్యాన్ని ప్రశ్నించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాజ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో
పలువురు సీఐల బదిలీ

కోల్‌సిటీ, ఫిబ్రవరి 28: లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కమిషనరేట్ పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన పలువురు సీఐలను బుధవారం బదిలీ చేస్తూ మల్టీ జోన్-1 ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ప్రమోద్‌రావును రామగుండం కమిషరేట్ ఐటీ కోర్‌కు, రామగుండం టాస్క్‌ఫోర్స్-2లో పని చేస్తున్న ఇంద్రసేనారెడ్డి గోదావరిఖని వన్‌టౌన్ సీఐగా బదిలీ చేశారు. గోదావరిఖని టుటౌన్‌లో పని చేస్తున్న ప్రసాద్‌రావును కమిషనరేట్‌లోని లీగల్ సెల్‌కు, మల్టీజోన్ ఐజీ ఆఫీస్‌లో వెయింట్‌లో ఉన్న రవీందర్‌ను టుటౌన్ సీఐగా, రామగుండం సీఐ టీ ప్రవీణ్‌కుమార్‌ను మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాలని సూచించారు. నిజామాబాద్ టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్న అజయ్‌బాబును రామగుండం సీఐగా, సుల్తానాబాద్ సీఐ జగదీష్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, సుబ్బారెడ్డిని సుల్తానాబాద్ సీఐగా, సరెండర్‌లో ఉన్న ఎం వెంకటేశ్వర్లును మంథని సీఐగా, మంథని సీఐ రాజుగౌడ్‌ను రామగుండం కమిషనరేట్ సైబర్ క్రైమ్-2కు బదిలీ చేశారు. మందమర్రి సర్కిల్‌లో పని చేస్తున్న రవిని, కమిషనరేట్‌లోని టాస్క్‌ఫో ర్స్-1లో పని చేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను, తాండూర్‌లో కూచన శ్రీనివాస రావును ఐజీ ఆఫీస్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. సైబర్ క్రైమ్ -2లో పని చేస్తున్న ఎంఎల్‌ఎం లింగయ్యను సైబర్ క్రైమ్-1కు బదిలీ చేశారు.

గుండేటి యోగేశ్వర్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న యోగేశ్వర్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: సమ్మక్క సారలమ్మ జాతరలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన విద్యాశాఖ పర్యావరణ విభాగం జిల్లా కో ఆర్డినేటర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత గుండేటి యోగేశ్వర్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం వరంగల్‌లోని పింగళి మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, జిల్లా కలెక్టర్ స్మిత పట్నాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఘనంగా సైన్స్ దినోత్సవం



జిల్లా కేంద్రంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఏసీసీ, ఫిబ్రవరి 28: మంచిర్యాల పట్టణంలోని జిల్లా సైన్స్ కేంద్రంలో బుధవారం సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యం హాజరయ్యారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సమాజానికి ,దేశానికి ఉపయోగపడే ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. డీఈవో యాదయ్య మాట్లాడుతూ అనేక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా నూతన ఆవిష్కరణలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లా ప్రతిభను చాటాలన్నారు. నూతన ఆవిష్కరణలు సమాజానికి వాటి ఉపయోగం అనే అంశంపై సెమినార్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ అధికారి మధుబాబు, ఎంఈవో జాడి పోచయ్య, ఎస్‌వో రాజేందర్, సాయి, సంపత్ తదితరులు పాల్గొన్నారు. కాగా మంచిర్యాలలోని శ్రీచైతన్య పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ప్రిన్సిపాల్ జోబిన్, డీన్ నాగేశ్వర్‌రావు, పీఈటీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: తరగతి గది నుంచే విద్యార్థులు శాస్త్రీయ ఆలోచనలు చేయాలని, ఇందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అంతకుముందు సీవీ రామన్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, జేవీపీ శ్రీనివాస్, అధ్యాపకులు రాజ్‌కుమార్, రాజేందర్, కౌసర్, శ్యామల, హారిక, స్రవంతి, కిరణ్, లక్ష్మీనారాయణ, రాజేష్, అనురిద్, శోభ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ విశిష్టతను తెలియజేసే పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కార్యదర్శి కొలిపాక విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని ఆవిష్కరణలు రూపొందించాలన్నారు. చంద్రయాన్ 3 పరికరాన్ని తయారు చేసిన ఐదో తరగతి విద్యార్థి తాండవ కృష్ణసేనకు మొదటి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నగేష్ మమత, మౌనిక పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలుప్రభుత్వ పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా వస్తువులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నూరు: ఆస్నాద గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో హెచ్‌ఎం అనురాధ, సైన్స్ ఉపాధ్యాయులు రవికుమార్, సురభి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని కుందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ వేడుకలను నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పూలమాలలు వేశారు విద్యార్థులు సైన్స్ నమూనాలు ప్రదర్శించారు.

కాసిపేట: మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను కాసిపేట ఎంపీడీవో సత్యనారాయణసింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్ బండ శాంకరి, తహసీల్దార్ భోజన్న, ఎంపీవో నాగరాజు, ఉపాధ్యాయులు వెంకటేశ్వర స్వామి, పుష్పలత, కృష్ణ గోపాల్, అర్చన, మాధవి పాల్గొన్నారు.



ముత్యంపల్లిలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్

కోటపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్ లో సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, కేజీబీవీలో ప్రత్యేకాధికారిణి హరిత , సైన్స్ ఉపాధ్యాయులు వసంత, వీరస్వామి ,ఆమని , శ్రీనివాస్, మీన పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని కలమడుగులోని వివేకానంద పాఠశాలలో ారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రదర్శనలను రూపొందించి ప్రదర్శించారు. ప్రదర్శనలను జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేకర్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేష్‌కుమార్, హెచ్‌ఎం రాజమౌళి, గౌడ సంఘం నాయకులు మనోజ్‌కుమార్ తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌గౌడ్, తిరుపతి తదితరులుపాల్గొన్నారు.

శ్రీరాంపూర్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని తీగల్‌పహాడ్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు సైన్స్‌కు చెందిన నమూనాలు, అంతరిక్ష నమూనాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు హాజరయ్యారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దాదాపు అన్ని సబ్జెక్టులలో 300 వరకు ప్రాజెక్టులు, మోడల్స్‌ను తయారు చేశారు. ముఖ్య అతిథులుగా పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ జంగం కల, వైస్ చైర్మన్ ఎర్రం సాగర్ రెడ్డి, రామకృష్ణాపూర్ పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, తవక్కల్ విద్యా సంస్థల చైర్మెన్ అబ్దుల్ అజీజ్‌లు పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పాఠశాలల్లో సైన్స్ డే వేడుకలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 28: కాగజ్‌నగర్ పట్టణం, మండలంలో బుధవారం సైన్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్‌లోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రయోగాలను నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలు పాఠశాల్లో సైన్స్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆరెగూడలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు చేసిన ప్రయోగాలను ఆయన అభినందించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, అనిత, రాజేశం, రమేష్, తుకారం, మామిడాల తిరుపతయ్య, రోజారమణి కేశవ్, అనీష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెజ్జూరు: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, జ్యోతిబాపూలే విద్యాలయంతో పాటు అన్ని పాఠశాలల్లో బుధవారం జాతీయసైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



కాగజ్‌నగర్‌లో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా సైన్స్ అధికారి మధుకర్

కాల్పుల కలకలం

- ఆస్తి కోసం అత్తమామలపై అల్లుడి ఘాతుకం

కన్నెపల్లి, ఫిబ్రవరి 28 : మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం సాలిగామ గ్రామంలో కాల్పుల కలకలం చోటు చేసుకుంది. అత్తమామలపై ఆస్తి కోసం అల్లుడు మంగళవారం అర్ధరాత్రి కాల్పులు జరిపాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోమాస నరేందర్ అనే వ్యక్తి తన మామ గోలేటి శంకర్, అత్త లక్ష్మిపై తుపాకీతో రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు. గమనించిన శంకర్ కుటుంబ సభ్యులు ఇంటి వెనుక తలుపు తీసుకుని ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కన్నెపల్లి మండలంలోని సాలిగామ గ్రామానికిచెందిన గోలేటి శంకర్ కూతురిని ఏడేళ్ల క్రితం మాలగురిజాలకు చెందిన గోమాస నరేందర్‌కు ఇచ్చి వివాహం చేశారు. నరేందర్ కరీంనగర్‌లో ఓ పేపర్ ప్లేట్ల కంపెనీలో పని చేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. ఈ దంపతులకు కొడుకు, కూతురు ఉన్నారు. కొద్ది రోజులుగా నరేందర్ భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. మంగళవారం రాత్రి సాలిగామకు తన మిత్రులతో కలిసి వచ్చిన నరేందర్ భూమి అమ్మి డబ్బులు ఇవ్వాలని అత్తమామలపై ఒత్తిడి చేశాడు. వారు వినకపోవడంతో వెంట తెచ్చుకున్న తుపాకీతో కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో వారు అతడి నుంచి తప్పించుకుని పారిపోయారు. ఈ కాల్పుల్లో ఎవరికి గాయాలు కాలేదు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్తి కోసమే తమ అల్లుడు నరేందర్ కా ల్పులు జరిపాడని శంకర్ దంపతులు తెలిపారు. బుల్లెట్లు గోడకు తగి లాయని, తాము ప్రమాదం నుంచి బయట పడ్డామని వివరించారు. కాల్పులు జరిపిన నరేందర్ పరారీలో ఉన్నాడు.



నిందితుడు నరేందర్



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రవికుమార్

● **తుపాకీ ఎక్కడిది?**

ఆస్తి కోసం అత్త మామలపై కాల్పులు జరిపిన నరేందర్‌కు తుపాకీ ఎక్కడ నుంచి వచ్చిందని పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారు. నరేందర్ కొంత కాలంగా అత్తమామలను రూ.10 లక్షల అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడు. తుపాకీతో బెదిరించి డబ్బులు గుంజాలనే ఉద్దేశ్యమా లేక హత్య చేయాలని వచ్చాడా అనే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఏసీపీ రవికుమార్ ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు.

లక్ష్యాన్నిఎంచుకోవాలి

భీమిని, ఫిబ్రవరి 28: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని చదువులో ముందుకుసాగాలని ఎంపీడీవో గంగమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్ రైతు వేదిక వద్ద భీమిని, కన్నెపల్లి మండలాల పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కజ్జం రమేశ్, వెంకటస్వామి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 28: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పేదవిద్యార్థులకు చేయూత నందిస్తామని,వారి విద్యాభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్‌కుమార్ తెలిపారు. బుధవారం పలువురు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు,పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 28: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ షకీల్ అన్నారు. బుధవారం అభయ హస్తంలో నాలుగు గ్యారంటీలు అమలు కావడంతో మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే నని అన్నారు. అనంతరం బాణా సంచాకాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, తదితరులు ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే



దర్జీలను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య

ఏసీసీ, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రంలో స్వచ్ఛంద పౌర సేవాసంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ టైలర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలోని బెన్‌టెక్స్ టైలర్ షాపు వద్ద దర్జీ కార్మికులను మున్సిపల్ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్ర మంలో పౌరసేవా సంస్థ ప్రధానకార్యదర్శి తుల మధుసూదన్‌రావు, నరెడ్ల శ్రీనివాస్, కల్వకుంట్ల మల్లయ్య, కర్రె లచ్చన్న తదితరులు పాల్గొ న్నారు.

కాసిపేట: మండలంలోని సోమగూడెంలో బుధవారం టైలర్స్‌డేను దర్జీలు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికిసంఘం అధ్యక్షుడు ఆడెపు పరమేశ్వర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దర్జీలకు గతంలో మంచి ఆదరణ ఉండేదని, ప్రస్తుతం వస్త్రవ్యాపార రంగంలో వచ్చిన మార్పుల వల్ల దర్జీలకు పూట గడవడమే కష్టంగా మారిందన్నారు.

దర్జీలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాటేటి రాజమౌళి, రాజిరెడ్డి, శేఖర్, రవీందర్, తిరుపతి, పున్నం పాల్గొన్నారు.

చెన్నూరు: పట్టణంలో టైలర్స్‌డేను బుధవారం మేరు సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాసిపేట, ఫిబ్రవరి 28: కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో ఒకరి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్నిపట్టుకున్నట్లు దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచి అమ్ముతున్నారనే సమాచారంమేరకు మంగళవారం రాత్రి దేవాపూర్‌లోని విగ్నేష్ ఇంటిపై దాడి చేయగా 40 క్వింటాల్ల రేషన్ బియ్యం లభించాయని చెప్పారు. ప్రజల నుంచి తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

చెన్నూరు, ఫిబ్రవరి 28 : చెన్నూరు కోర్టు పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లలో గల పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని చెన్నూరు జడ్జి పర్వతపు రవి అన్నారు. స్థానిక కోర్టులో బుధవారం మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ లోక్‌అదాలత్ పట్ల కక్షిదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లోక్ అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జైపూర్‌ఏసీపీ వెంకటేశ్వర్, సీఐలు రవీందర్, సుధాకర్,న్యాయవాదులు పాల్గొన్నారు.

ఘనంగా చప్రాడ మహారాజ్ పల్లకీ శోభాయాత్ర



పల్లకీ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో చప్రాడ మహారాజ్ పుణ్యతిథి సందర్భంగా భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 28: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణపతి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చతుర్థిని పురస్కరించుకుని ఉపవాస దీక్షలను రాత్రి 9.30గంటల తరువాత చంద్రోదయం అనంతరం విడిచారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

కెరమెరి, ఫిబ్రవరి 28: వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యే కాధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటిఎద్దడి లేకుండా చూడాలన్నారు. అలాగే ఉపాధి హామి పనులలో కూలీల శాతాన్ని పెంచాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంపీవో అమ్జద్‌పాషా, ఏపీఓ మల్లయ్య, ప్రత్యేకాధికారులు ప్రకాష్, విశ్వేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

దహెగాం, ఫిబ్రవర 28: మండల టీయూటీఎఫ్ కార్యవర్గాన్ని బుధవారం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అధ్యక్షతన ఎన్నుకున్నారు. గౌరవఅధ్యక్షుడుగా నారాయణ, అధ్యక్షుడుగా జయేందర్, ప్రధానకార్యదర్శిగా మహేష్, ఉపాధ్యక్షులుగా శికుమార్, శారదను ఎన్నుకున్నారు.



ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 28: ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావు సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాయలంలో ఉపాధి హామీపనులపై సమావేశం నిర్వహించారు. అయన మాట్లాడుతూ వేసవి ప్రారంభమైనందున నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలన్నారు. రోజుకు రెండు పూటలా నీరు పోయాలని, ఎండ వేడి పడకుండా గ్రీన్ మ్యాట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కూలీలు ఉదయం 10 గంటలలోగా పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో బీరయ్య, ఏపీవో రజియా సుల్తానా పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో గల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రి రిజిష్టర్‌లు, బయోమెట్రిక్ అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యకేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా అందుబాటులో ఉంటూ విధుల్లో సమయ పాలన పాటించాలని సూచించారు. జిల్లాలో నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భిణీల వివరాలను నమోదు చేయాలని, వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులను అందించాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. అనంతర ఆసుపత్రిలోని వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

● సఖి కేంద్రం ద్వారా సేవలు

మహిళలు, బాలికలు,యువతులకు రక్షణగా భరోసాగా సఖి కేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సఖి కేంద్రం బాలికలు, యువతులు,మహిళలకు రక్షణ కల్పించి పోలీసు, వైద్యఆరోగ్య, న్యాయ శాఖల సమన్వయంతో సేవలు అందిస్తున్నామని చెప్పారు. లైంగిక వేధింపులు, గృహహింసక ఎగురైన మహిళలకు ఆశ్రయం కల్పించడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కౌన్సిలింగ్ ఇచ్చి ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఏకలవ్య ఆశ్రమాన్ని సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెను, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ అవసరమైన వైద్య సేవలు అందించాలని నిర్వహకులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్,సఖి కేంద్రం పరిపాలన అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సదరం శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: జిల్లాలో మార్చి 5 నుంచి నిర్వహించనున్న సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని జిల్లాకేంద్రంలోనిప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం శిబిరాలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మార్చి 5,18 తేదీల్లో శారీరక వికలాంగులకు 100 మంది , 13,16 తేదీల్లో మూగ,చెవుడు 100 మంది, 6,22 తేదీల్లో కంటి చూపు 60 మంది, 26,28 తేదీల్లో మానసిక వికలాంగులు 100 మందికి అవకాశం కల్పించనున్నామని పేర్కొన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో సకాలంలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

దండేపల్లి, ఫిబ్రవరి 28: లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని బుధవారం పదో తరగతి విద్యార్థులకు పేర్‌వెల్ వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దుర్గం మహేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌ఎంసీ ఛైర్మన్ తిరుపతి, మాజీ వైస్ ఛైర్మన్ రమదేవి పాల్గొన్నారు.

విద్యార్థినులను సన్మానించిన డీఈవో

ఏసీసీ, ఫిబ్రవరి 28 : ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఇంగ్లీష్ డ్రామాపోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మంచిర్యాల కేజీబీవీ విద్యార్థినులను డీఈవో యాదయ్య బుధవారం సన్మానించారు. డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినుల ప్రదర్శించిన బ్యాడ్ ఎఫెక్ట్‌ఆఫ్ సోషల్ మీడియా అండ్‌చిల్డ్రన్ టీం రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం అభినందనీమని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, గైడ్ టీచర్ ,సెక్టోరల్ అధికారులు చౌదరి , సత్యనారాయణమూర్తి, విద్యార్థినులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చికిత్స విజయవంతం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 28: హైదరాబాద్‌లోని యశోదా ఆసుపత్రి ఆధ్వర్యంలో బ్లడ్ క్యాన్సర్ బోన్ మ్యారో సంబంధిత చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని ఆస్పత్రి డాక్టర్ గణేష్ జైషేత్వార్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలోని ధర్మారం గ్రామానికి చెందిన అభినవ్ అనే యువకుడు బ్లడ్ క్యాన్సర్‌తో ఆస్పత్రిలో చేరాడన్నారు. యువకుడి తండ్రి వద్ద నుంచి బోన్ మ్యారో సేకరించి చికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ నవీన్, రోగి కుటుంబీకులు పాల్గొన్నారు.

ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న వైద్యులు, ప్రజాప్రతినిధులు

చెన్నూరు, ఫిబ్రవరి 28: చెన్నూరులో కొత్తగా నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డెవలప్‌మెంట్ కమిటీ సమావేశానికి కన్వీనర్‌డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవా రం నిర్వహించారు. ఈ సమావేశంలో డెలివరీ సెక్షన్ ఆపరేషన్ థియేటర్, డయాలసిస్ చేయు విధానం, ఆసుపత్రి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో కోటపల్లి ఎంపీపీ మంత్రి సురేఖ, తహసీల్దార్ మల్లికార్జున్, కమీషనర్ గంగాధర్, భీమారం జడ్పీటీసీ భుక్య తిరుమల,మందమర్రి ఎంపీపీ మంగ, రాజిరెడ్డి, బాపురెడ్డి, రామిరెడ్డి, పోగుల సతీష్, 10 మంది డాక్టర్లు, 15 మంది నర్సులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 28: హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ లక్ష్మీగణపతి దేవాలయంలో బుధవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించారు. చెరుకు రసంతో విశేష మహా అభిషేకం చేపట్టారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 28: పట్టణంలోని మల్లికార్జున నగర్‌లో 15వ వార్డు ఏరియాలో నివసించే గుడిసెల కొమురయ్య ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు కాలిపోవడంతో బుధవారం పెళ్లి రోజు జరుపుకుం టున్న కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు అరుణ సతీష్ సంధ్య దంపతులు బాధిత కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో అర్నె సతీష్ దంపతులతో పాటు స్థానిక నాయకుడు బింగి శివ, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

- యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయం
- స్థానిక అవసరాల మేరకు రూపకల్పన
- అప్రెంటీస్‌షిప్, జాబ్ మేళా ద్వారా భవిష్యత్‌కు బాటలు
- అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎంపిక
- జిల్లాలో నాలుగు ప్రభుత్వ ఐటీఐల ద్వారా నాణ్యమైన శిక్షణ



ఎలక్ట్రికల్ ల్యాబ్‌లో విద్యార్థులు

ఏసీసీ, ఫిబ్రవరి 28: యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ఐటీఐల్లో కొత్త కోర్సులు ఏర్పాటు చేస్తోంది. జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలలో పారిశ్రామిక శిక్షణ పూర్తి చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా నాలుగు ప్రభుత్వ ఐటీలు మంచిర్యాల, మందమర్రి, శ్రీరాంపూర్, జన్నారంలో ఉన్నాయి. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ 1969లో ఏర్పాటు చేశారు. మిగిలినవి అనం తరం ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీఐలు అన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆధీనంలో పనిచేస్తాయి.

జిల్లాలోని ఐటీఐలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, మోటారు మెకానిక్, టర్నర్, కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో ఫ్యాషన్ టెక్నాలజీ, సోలార్ టెక్నిషియన్ కొత్త కోర్సులు కూడా అందు బాటులోకి తెచ్చారు. ఒక్కో ట్రేడ్‌లో గరిష్టంగా వంద మంది విద్యార్థుల నుంచి కనిష్టంగా 20 మంది విద్యార్థుల వరకు శిక్షణ పొందుతున్నారు. దాదాపు అన్ని కోర్సుల్లోప్రవేశానికి పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు.

■ నెలకొకటి చొప్పున మేళా..

డైరెక్టర్ జనరల్ ఎంప్లాయిమెంట్ అండ్‌ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ప్రతి ప్రభుత్వ ఐటీఐలో నెలకు ఒక అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించాల్సి ఉంది. ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులకు మంచి ప్రతిష్ఠాత్మకమైన కంపెనీల్లో అప్రెంటీస్‌షిప్ చేసేందుకు ఎంపికవుతున్నారు. ఈసీఐఎల్, టాటా ఏరో స్పేస్, సింగరేణి, రైల్వే వంటి వాటిలో అప్రెంటీస్‌షిప్ పూర్తి చేయడంతో పాటు కొన్ని సంస్థలు వాటిలోనే అనంతరం ఉపాధి కల్పిస్తున్నాయి. అప్రెంటీస్‌షిప్ సమయంలో స్టైఫండ్ కూడా విద్యార్థులకు చెల్లిస్తున్నారు. జాబ్‌మేళాల ద్వారా పేరున్న ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు పొందుతున్నారు. నోటిఫికేషన్‌ల ద్వారా పరీక్షలు రాసి ట్రాన్స్‌కో, టీఎస్‌ఎన్‌పీ డీసీ ఎల్, రైల్వే, సింగ రేణి, ఈసీఐఎల్, బార్క్, సిర్పూరు పేపరు మిల్లు వంటి వాటిలో ఉద్యోగాలు పొందుతున్నారు. 2021 లో నిర్వహించిన జూనియర్ లైన్‌మన్ పరీక్షలో మంచిర్యాల ఐటీఐలో చదివిన 10 మంది అమ్మా యిలు పరీక్షలు రాసి ఉద్యోగం సాధించారు.

■ నైపుణ్యాల మెరుగుదలకు..

మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందు లో భాగంగా భవన నిర్మాణానికి ఇక రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో పాటు టాటా సంస్థ ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శిక్షణను అందించనున్నారు. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐలో చదువుకున్న వారిలో ఉత్తీర్ణత శాతం 2022లో 96 శాతం, 2023లో 89 శాతంగా ఉంది. ప్రభుత్వ ఐటీఐలో ఎలాంటి ఫీజులు లేకుండా ఉచితంగా విద్యనందిస్తున్నారు. అర్హులకు స్కాలర్‌షిప్‌లు కూడా ప్రభుత్వం మంజూరు చేస్తోంది. మంచిర్యాల, మందమర్రిలో ఐటీఐలకు అను బంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మందమర్రిలో నిర్మాణం పూ ర్తయి వారం రోజుల క్రితం ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, సింగరేణి అధికారులు సెంటర్‌ను ప్రారం భించారు. మంచిర్యాలలో రూ.8కోట్ల నిధులతో నిర్మా ణ దశలో ఉంది. దీని ద్వారా కూడా యువతకు షార్ట్‌టర్మ్ కోర్సులు అందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు.

■ భవనాలు లేక ఇబ్బంది..

మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆర్‌అండ్ బీ అధికారులు వినియోగానికి పనికి రాదని సర్టిఫై కూడా చేశారు. 2022లోనే కొత్త భవనం కోసం రూ. 13.4 కోట్లతో ఎస్టీమేషన్ చేయించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపినప్పటికీ నిధులు మంజూరు కాలేదు. భవనంలో చాలా భాగంగా పగుళ్ల తేలి పెచ్చు లూడుతుంది. సరిపడా గదులు లేక ల్యాబ్‌లు , క్లాస్‌రూంలు ఒకే చోట నిర్వహించాల్సి వస్తుంది. శ్రీరాంపూర్‌లో సింగరేణి పాఠశాల భవనంలో, జన్నారంలో ప్రభుత్వ పాఠశాల భవనంలో ఐటీఐలు నిర్వహిస్తున్నారు. మంద మర్రిలో మాత్రమే సొంత భవనం ఉంది. జిల్లా లోని ఐటీఐలలో టీచింగ్‌స్టాఫ్ కూడా తగినంత మంది లేరు. ఏళ్ల తరబడి నియామకాలు లేనందున అరకొర సిబ్బందితోనే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

కోర్సు ఎంతో ఉపయోగకరంగా ఉంది

జ్యోతిశ్రీ, మిట్టపల్లి , ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు



ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు ఎంతో ఉపయోగక రంగా ఉంది. ఈ కోర్సు నేర్చుకోవడం ద్వారా జీవితంలో స్థిరపడతాననే నమ్మకం కలిగింది. ప్ర భుత్వ ఐటీఐలు నైపుణ్యతతో కూడిన శిక్షణను చక్కగా అందిస్తున్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఉద్యోగావకాశాలతో పాటు స్వయం ఉపాధి..

చందర్, మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్



ఐటీఐలో కోర్సులు పూర్తి చేసిన వారు ప్రభుత్వ ,ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలతో పాటు స్వయం ఉపాధి కూడా పొందవచ్చు. రెండు సంవత్సరాల కోర్సుపూర్తి చేసిన వారు కొన్ని డిప్లొమా కోర్సుల్లో నేరుగా ద్వితీయ సంవత్సరంలో చేరేందు కు అర్హులు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు పూర్తిచేసిన వారు టెక్నికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ పరీక్ష రాసి షార్ట్‌టర్మ్ శిక్షణ ద్వారా డీఎస్సీ రాయడానికి అర్హత సాధించడం ద్వారా ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక య్యే అవకాశం ఉంది.



పెచ్చులూడిన మంచిర్యాలలోని ఐటీఐ భవనం పైకప్పు

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

ఏసీసీ, ఫిబ్రవరి 28: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మొదటి రోజు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 1 పరీక్షకు గాను జిల్లా వ్యాప్తంగా జనరల్ విభాగంలో 6,063 మంది విద్యార్థులకు గాను 5,672 మంది విద్యార్థులు , ఒకేషనల్ విభాగంలో 1132 మందికి 1039 మంది హాజరయ్యారు. మొత్తం 7,195 మంది విద్యార్థులకు గాను 6,711 మంది హాజరు కాగా 484 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల్లో హాజరైన వారు 93.27 శాతంగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 25 పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు ఉదయం విద్యార్థులు చేరుకుని హాల్ టికెట్ నంబర్లు వెతుకున్నారు. పరీక్ష కేంద్రాలవద్ద సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేశారు.

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్: ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల వార్షిక పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి శైలజతో కలిసి బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల కోసం 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లను, సిబ్బందిని నియమించామని చెప్పారు. రు. అనంతరం డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్‌తో కలిసి మిమ్స్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు.

దండేపల్లి: దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ కళాశాల, మేదరిపేట కాకతీయ ప్రైవేట్ కళాశాలలకు చెందిన 227 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరిండింట్ బి శోభ, డిపార్ట్‌మెంటల్ అధికారి బాపురావులు వెల్లడించారు.. పరీక్ష కేంద్రాన్ని దండేపల్లి తహసిల్దార్ సంధ్యరాణి, లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్ తనిఖీ చేశారు. దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలోని ఇంటర్మీడియట్ సీఈసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సాయిని పోషన్న పుట్టకతో అంధుడు. బుధవారం ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కావడంతో దండేపల్లిప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోషన్న పరీక్ష కేంద్రం రాగా అక్కడ విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సాంబయ్య లోపలికి తెసుకెళ్లాడు. దండేపల్లి చెందిన ముష్కే లోకేష్ అనే బీఎస్సీ విద్యార్థి సాయంతో పోచన్న పరీక్ష రాశాడు.

జైపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాం తంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి అన్నారు. పరీక్ష కేంద్రంలో 364 మంది విద్యార్థులకు గాను 345 మంది విద్యార్థులు హాజరయ్యారని, 19 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సందర్శించి బందోబస్తు వివరాలను ఎస్సై ఉపేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల 144 సెక్షన్ అమలులో ఉన్నందున జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను మూసివేయిం చాలని సూచించారు. ఏసీపీ వెంట తహసీల్దార్ వనజారెడ్డి తదితరులు ఉన్నారు.

మందమర్రి టౌన్: పట్టణంలోని ఇంటర్మీడియట్‌పరీక్ష కేంద్రాలను బుధవారం బెల్లంపల్లి ఏసీపీ రవీందర్ పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద ఉన్న పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నామని తెలిపారు.

చెన్నూరు: చెన్నూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 235 మందికి 221 మంది హాజరయ్యారు. సాంఘిక సంక్షేమగురుకుల బాలికల పాఠశాల కేంద్రంలో 264 మందికి 257 మంది హాజరు కాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ రవీందర్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సభ్యుడు అజిత్ పరిశీలించారు.



అల్ఫోర్స్ జూనియర్ కళాశాల కేంద్రంలో బారులు తీరిన విద్యార్థులు

వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా

భీమారం, ఫిబ్రవరి 28 : మండల వైస్ ఎంపీపీ ఎన్నిక బుధవారం జరగాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా పడింది. గతంలో వైస్ ఎంపీపీగా పనిచేసిన జనంపెల్లి సమ్మయ్య ఎన్నికల ఖర్చుల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు అందించకపోవడంతో గత రెండేండ్ల క్రితం ఆయన ఎంపీటీసీ పదవీని రద్దుచేయడంతో వైస్ ఎంపీపీ పదవీ సైతం రద్దు అయ్యింది. దీంతో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించారు. ఉదయం 11 గంటలకు వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా భీమారం మండల ఎన్నికల అధికారి, స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య ఆలస్యంగా హాజరయ్యారు. మండలంలో నలుగురు ఎంపీటీసీలు ఉండగా ఒక ఎంపీటీసీ పదవీ రద్దు కావడంతో ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఇందులో ఎంపీటీసీ చేకుర్తి సరోజ గైర్హాజరు కావడం, ఎంపీపీ చెరుకు దీపికరెడ్డి, ఎంపీటీసీ పెద్దల రూపలు హాజరు కావడం, అధికారి ఆలస్యంగా హాజరు కావడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. తిరిగి గురువారం ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

బీమా చెక్కు పంపిణీ

భీమారం, ఫిబ్రవరి 28 : మండంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన గోస్కుల లక్ష్మణ్ కుటుంబీకులకు బుధవారం రూ. 2 లక్షల బీమాచెక్కును ఎస్‌బీఐ శాఖ కార్యనిర్వహణ అధికారి ప్రతీక్ యాద్,ఉప కార్యనిర్వహణ అధికారి విజయ్‌కుమార్, అజయ్‌లు అందజేశారు. వారు మాట్లాడుతూ లక్ష్మణ్ భీమారం ఎస్‌బీఐ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమాయోజన భీమా చేసుకున్నాడని, ఆయన ఇటీవల మృతిచెందడంతో ఆయన భార్య అంజలికి చెక్కు అందించినట్లు తెలిపారు. బ్యాంకు ద్వారా అందిస్తున్న బీమా సదుపాయాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షీటీం సేవలపై అవగాహన

చెన్నూరు, ఫిబ్రవరి 28: చెన్నూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం షీటీం సేవలపై ఎస్సై వెంకటేశ్వర్‌రావు అవగాహన కల్పించారు. ఆయన మాటాడుతూ మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం షీటీంలు పనిచేస్తాయని తెలిపారు. ఆకతాయిలు ఎవరైనా వేధిస్తే 6303923700కు సమాచారం అందించాలని తెలిపారు. అలాగే డయల్ 100కు కూడా ఫిర్యాదు చేయవ చ్చని తెలిపారు. సమావేశంలో ఏఎస్సై ఎర్రయ్య, కానిస్టేబుళ్లు సతీష్, శ్రావణ్‌కుమార్, ఎంఈవో రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న హరీష్‌కుమార్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 28: పట్టణంలోని దీపక్‌నగర్ సినిమాహాలు ఏరియాకు చెందిన పూదరి హరీష్‌కుమార్ కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజా సంబంధ ప్రచార ప్రభావం - తెలంగాణ రాష్ట్ర అధ్యయనం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను గోల్డ్‌మెడల్ సాధించాడు. బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగుయూనివర్సిటీ నిర్వహించిన 16వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌ను అందుకున్నాడు. హరీష్‌కుమార్ మాట్లాడుతూ ఈ గోల్డ్‌మెడల్ రావడం తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పరిశోధనలు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ యూని వర్సిటీ వీసీ కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ పాల్గొన్నారు.

వినియోగదారులు నాణ్యమైన వస్తువులు పొందాలి

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 28: నాణ్యమైన వస్తువులు పొందడం వినియోగదారుని హక్కు అని వీఏసీసీ ఛైర్మన్ డాక్టర్ రాజలింగు మోతె అన్నారు. రామకృష్ణాపూర్ సూపర్ బజార్‌లోని విజిలెన్స్ అండ్ యాంటీ కరప్షన్ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వీఏసీసీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్, సోషల్ డిటెక్టివ్ సెల్ నూతన కమిటీని కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ రాజలింగు మోతె, వైస్ ఛైర్మన్ దుర్గం వెంకటస్వామి ప్రకటించారు. కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మాదాసు శ్రీకాంత్ యాదవ్, కన్స్యూమర్ రైట్ ప్రొటెక్షన్ సెల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా కెలోత్ బాలు, జనరల్ సెక్రటరీ వుల్లంగుల సదానందం, సోషల్ డిటెక్టివ్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా దుస్స ఆదిత్య కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ఛైర్మన్ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడానికి, అవగాహన కల్పించడానికి పోలీసు, మీడియా, ప్రజలకు ఉమ్మడి వేదికగా కౌన్సిల్ పనిచేస్తుందన్నారు.నాణ్యమైన వస్తువులు పొందడం వినియోగదారుని ప్రాథమిక హక్కని,వినియోగదారుల హక్కుల కోసం కౌన్సిల్ సభ్యులు పనిచేయాలని ఆయన సూచించారు. వినియోగదారులు నాణ్యమైన వస్తువులు అందకుంటే ఫిర్యాదు చేయాలని కోరారు.